సాక్షి కామారెడ్డి

గురువారం । 17 । అక్టోబర్ । 2024



దళారులకు అమ్మి మోసపోవద్దు

జిల్లాలోని పలు గ్రామాలలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

- 9లో ▸



ఎంపీవోపై విచారణ

ఇబ్బంది ఎంపీవో కార్యదర్శులను వేధిస్తున్నారన్న ఆరోపణలపై డీపీవో శ్రీనివాస్‌రావు విచారణ జరిపారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం

39.7 /22.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బంగారం మరింత ప్రియం!

- 10 గ్రాముల ధర రూ. 78,900

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బంగారం ధర మరింతగా పెరిగింది. బుధవారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 78,900 లు పలికింది. ప్రస్తుతం శుభ ముహూర్తాల సమయం కావడంతో చాలా మంది బంగారం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలో ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కొత్త ఉపాధ్యాయినులు 151 మంది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో డీఎస్సీ–2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయుల్లో 151 మంది మహిళలు ఉన్నారు. 506 పోస్టుల భర్తీకోసం డీఎస్సీ నిర్వహించిన విద్యాశాఖ.. ఇటీవల 434 మందికి పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇందులో పురుషులు 283 మంది, మహిళలు 151 మంది ఉన్నారు. ఈ డీఎస్సీ ద్వారా దాదాపు 35 శాతం మంది మహిళలు కొలువు సాధించారు. ఇందులో చాలామంది ఇల్లాలిగా, తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉద్యోగం సాధించడం గమనార్హం.

టూరిజం స్పాట్ కోసం స్థల పరిశీలన



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు వద్ద టూరిజం స్పాట్ ఏర్పాటు చేసేందుకోసం బుధవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ స్థలాన్ని పరిశీలించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు ప్రాజెక్టు వద్ద టూరిజం స్పాట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఆర్ఐ మహ్మద్, నాయకులు వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యం తదితరులున్నారు.

పోచారం నీటి విడుదల నిలిపివేత



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను బుధవారం నిలిపివేశారు. ఆయకట్టు పరిధిలో పంటల సాగు దాదాపుగా పూర్తి కావడంతో ఇరిగేషన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1.82 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రానికి 1.665 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

19న స్విమ్మింగ్ ఎంపికలు

నిజామాబాద్ నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. నగరంలోని సుభాష్ నగర్‌లో గల ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభం అవుతాయని ఆసక్తి ఉన్న వారు బోనాఫైడ్ తీసుకొని రావాలని సూచించారు. అలాగే అండర్–14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 19న ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'రుణమాఫీ'పై అయోమయం!

పంట రుణాల మాఫీతో రుణ విముక్తి పొందుతామని ఆశించిన వేలాది మంది రైతుల ఆశలు నెరవేరలేదు. సాంకేతిక కారణాలతో చాలామంది పంట రుణాలు మాఫీ కాలేదు. సర్వేలు, సాంకేతిక కారణాల పేరు చెప్పి సర్కారు కాలయాపన చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులందరి రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు.



- అర్హులందరి పంట రుణాలు మాఫీ చేస్తామన్న సర్కారు
- మూడు విడతల్లో సగం మందికే ప్రయోజనం
- నెలలు గడుస్తున్నా స్పష్టత కరువు
- ఆందోళనలో మిగతా రైతులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 1,98,374 మంది రైతులు ఆయా బ్యాంకుల్లో రూ. 1,283 కోట్ల పంట రుణాలు పొందారు. తాము అధికారంలోకి వస్తే రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో వారంతా సంబురపడ్డారు. అయితే అధికారంలోకి వచ్చాక సర్కారు రకరకాల కొర్రీలు పెట్టడంతో చాలామంది నిరాశ చెందారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతల్లో పంట రుణాలను మాఫీ చేసింది. జిల్లాలో సుమారు 92 వేలమంది రైతులకు సంబంధించిన రూ. 655 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. మిగిలిన రైతులకు సంబంధించిన పంట రుణాలు మాఫీ కాలేదు.

రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలలో పేర్లలో పొరపాట్లు ఉండడం, రేషన్ కార్డు లేకపోవడం వంటి కారణాలతో వేలాది మందికి లబ్ధి చేకూరలేదు. దీంతో వారంతా అధికారుల చుట్టూ తిరగడంతో సర్కారు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులు పైమొత్తాన్ని ముందుగా చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో చాలామంది రూ. 2 లక్షలపైన ఉన్న మొత్తాన్ని చెల్లించి రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమాచారం లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నాం

పంట రుణాల మాఫీకి సంబంధించి మా దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నాం. సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం. జిల్లాలో కుటుంబ నిర్ధారణ సర్వే చివరి దశలో ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చూస్తాం.

– తిరుమల ప్రసాద్, డీఏవో, కామారెడ్డి

పట్టాదారు పాస్ పుస్తకంలో తప్పిదాలు, ఆధార్ మిస్ మ్యాచ్‌లాంటి అనేక రకాలైన సాంకేతిక సమస్యల కారణంగా చాలామందికి రుణ మాఫీ కాలేదు. రేషన్ కార్డులేకపోవడం, ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలో పేరు వేరువేరుగా ఉండడం, ఓవర్ డ్యూ ఇంట్రెస్ట్, పట్టా పాస్ పుస్తకం లేకుండా లోన్, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉండడం, కుటుంబంలో సర్వీస్ పెన్షన్ దారు ఉండడం వంటి 32 రకాల కారణాలతో చాలామందికి రుణమాఫీ చేయలేదు. ఆయా సమస్యలను పరిష్కరించి అర్హులందరి రుణాలు మాఫీ

9,784 ఫిర్యాదులు..

అయ్యేలా చూస్తామని సర్కారు హామీ ఇచ్చింది. సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించారు. రేషన్ కార్డు లేని వారి కోసం కుటుంబ నిర్ధారణ సర్వేను ప్రారంభించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు ఇప్పటివరకు 9,784 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా జరిపిన కుటుంబ నిర్ధారణ సర్వేలో రేషన్ కార్డులు లేని 21,340 మంది రైతులను వ్యవసాయ అధికారులు గుర్తించి వివరాలు సేకరించారు. వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారంలోగా సర్వే పూర్తి చేసి రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ రెండు నెలలు దాటినా సర్వే పూర్తి కాలేదు. ఇంకా సర్వే కొనసాగుతూనే ఉంది. నెలలు గడుస్తున్నా రుణమాఫీపై స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రైతులందరికి సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు.

'సెట్ బ్యాక్' సమస్యే?

- ఇరువైపులా 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు
- ఇప్పటికే షటర్లు, మెట్ల వరకు కొంతభాగం తొలగింపు
- మరో 10 ఫీట్ల వరకు వెనక్కి వెళ్తేనే డ్రైయినేజీ, పార్కింగ్‌కు స్థలం
- పట్టించుకోని వ్యాపారస్తులు.. అవగాహన కల్పించని అధికారులు



బాన్సువాడలో డ్రైయినేజీని ఆనుకుని ఉన్న దుకాణ సముదాయం

బాన్సువాడ : జాతీయ రహదారి విస్తరణ బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల ప్రజలు, దుకాణదారులకు కొత్త సమస్య తెచ్చిపెడుతుంది. రోడ్డు విస్తరణ పనులు బాన్సువాడ మున్సిపాలిటీతో పాటు బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని మహమ్మద్‌నగర్, బొగ్గుగుడిసె, కొత్తబాది, కొయ్యగుట్ట, సోమేశ్వర్, దుర్కి, నెమ్లి, నసూర్లబాద్, వర్నీ, అక్బర్‌నగర్, రుద్రూర్ వరకు కొనసాగుతున్నాయి. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి విస్తరణ పనులకు ఏడాది క్రితమే అనుమతులు లభించాయి. ఇందుకుగాను అధికారులు ప్రణాళిక సిద్ధం చేసి మూడు నెలల క్రితం రోడ్డుకు ఇరువైపులా సెట్ బ్యాక్‌కు సంబంధించిన మార్కింగ్ వేశారు. 100 ఫీట్ల రోడ్డుకుగాను ఇరువైపులా 50 ఫీట్ల వరకు మార్క్ చేశారు. డివైడర్ నుంచి ఇరువైపులా 43 ఫీట్ల వెడల్పుతో బీటీ రోడ్డు, రెయిన్ వాటర్ కోసం డ్రైయినేజీ నిర్మించనున్నారు. మిగత 7 ఫీట్ల స్థలంలో విద్యుత్ స్తంభాలకు, మిషన్ భగీరథ, టెలిఫోన్ ఇతర పైపులైన్లు ఏర్పాటు చేయనున్నారు. సెట్ బ్యాక్ కోసం ఇళ్లు, దుకాణాలకు సంబంధించి ముందు భాగాన్ని కొంత కూల్చి వేయించారు.

మరో 5 ఫీట్లు జరిగితేనే..

పట్టణంలోని మెయిన్ రోడ్డులో 100 ఫీట్ల రెడ్ మార్క్‌తో దుకాణాలు, ఇళ్లు ఉన్నవారు బాల్కనీల వరకు కూలగొట్టుకున్నారు. కానీ వీరికి కొత్తగా డ్రైయినేజీ సమస్య వచ్చింది. జాతీయ రహదారి నిర్మాణంతో పాటే వర్షపు నీరు వెళ్లేలా అధికారులు రెయిన్ డ్రైయిన్‌ను నిర్మిస్తున్నారు. ఈ డ్రైయిన్‌లోకి దుకాణాలు, ఇళ్లకు సంబంధించిన మురికినీళ్లు రావొద్దని నిబంధన పెట్టారు. ప్రజలకు డ్రైయినేజీ కాల్వ కావాలంటే మున్సిపల్ అధికారులు నిర్మించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం స్థలం లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. దుకాణదారులు, ఇళ్ల యజమానులు 100 ఫీట్ల మార్కింగ్ కంటే మరో 3 నుంచి 5 ఫీట్ల వరకు సెట్ బ్యాక్ చేసుకుంటేనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేకపోతే మురికినీరు రోడ్ల పైకి వచ్చే అవకాశాలున్నాయి.

మా పరిధి దాటలేం

మెయిన్ రోడ్డులో 100 ఫీట్లు మార్కింగ్ దాటిన వారికే ఇంటి నిర్మాణ అనుమతులు ఇస్తున్నాం. అంతకుమించి సెట్ బ్యాక్ కావాలని కోరే అధికారం మాకు లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫుట్‌పాత్‌ను తొలగిస్తారు. పట్టణంలో ఫుట్‌పాత్ దాటి ఇనుప గ్రిల్లింగ్ వేస్తారు.

– జంగం గంగాధర్, మున్సిపల్ చైర్మన్, బాన్సువాడ

పార్కింగ్ సంగతేంటి?

జాతీయ రహదారికోసం అధికారులు సూచించిన మేరకే ఇళ్ల యజమానులు సెట్‌బ్యాక్ చేసుకున్నారు. రోడ్డుకు అదనంగా స్థలం లేకపోవడంతో వాహనాల పార్కింగ్ సమస్యగా మారనుంది. ఇప్పటికే రెయిన్ డ్రైయిన్ నిర్మాణం కొనసాగుతుండగా, రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే ఇనుప గ్రిల్లింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇది ఏర్పాటు చేస్తే దుకాణాదారులకు పార్కింగ్ స్థలం ఉండదు. 5 ఫీట్ల వరకు అదనంగా సెట్ బ్యాక్ చేసుకుంటేనే పార్కింగ్‌కు అవకాశం ఉంటుంది. లేకపోతే రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాల్సి వస్తుంది. అధికారులు ఇచ్చిన మార్కింగ్ కంటే అదనంగా మరో 10 ఫీట్లు సెట్ బ్యాక్ అయితేనే డ్రైయినేజీ, పార్కింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయి. దీనిపై స్థానికులకు అవగాహన లేకపోవడంతో వారు అదనంగా స్థలాన్ని వదలడానికి ముందుకు రావడం లేదు. అధికారులు అవగాహన కల్పించకపోతే భవిష్యత్‌లో స్థానికులకు వరద నీటి, పార్కింగ్ కష్టాలు తప్పవు.

వ్యవసాయశాఖ అధికారుల నియామకం

కామారెడ్డి క్రైం/నిజాంసాగర్: జిల్లాలో ఖాళీగా ఉన్న 14 వ్యవసాయ అధికారుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటైన మహమ్మద్‌నగర్, డోంగ్లీ మండలాలకూ ఏవోలను నియమించింది. 12 మందిని మండల వ్యవసాయాధికారులుగా, ఇద్దరిని డీఏవో కార్యాలయంలో ఏవోలుగా నియమించామని డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు.

వ్యవసాయశాఖ అధికారి	మండలం	వ్యవసాయశాఖ అధికారి	మండలం
టి.మణిదీపిక	దోమకొండ	ఎస్.ప్రత్యూష	గాంధారి
వి.పవన్‌కుమార్	మాచారెడ్డి	ఆర్.భవాని	నస్రుల్లాబాద్
వి.సాయికిరణ్	నాగిరెడ్డిపేట	బి.మహేశ్వరి	జుక్కల్
జి.నవ్య	మహమ్మద్‌నగర్	బి.కార్తీక్	బీర్కూర్
బి.భానుశ్రీ	రామారెడ్డి	కె.శివకుమార్	డోంగ్లీ
ఎండీ.మిఫ్తా ఫైజుల్లా	బాన్సువాడ	డి.అచరిత	డీఏవో, కామారెడ్డి
బి.శోభ	ఎల్లారెడ్డి	ఈ.సుస్మితరాణి	డీఏవో, కామారెడ్డి

క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: క్రమశిక్షణతో చదివితే భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన బస్వాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. సెలవులో ఉన్న ఇద్దరు టీచర్లకు సంబంధించిన లీవ్ లెటర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. సెల్‌ఫోన్ చూడడాన్ని తగ్గించుకుని, చదవడంపై దృష్టి సారించాలన్నారు. బాగా చదివి మంచి ఉద్యోగం సాధించి కన్న తల్లిదండ్రులకు, సొంత ఊరికి పేరు తీసుకురావాలని సూచించారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కోరారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం జయదేవ్, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

లక్ష్యానికి అనుగుణంగా రుణాలివ్వాలి

- మొండి బకాయిలను రికవరీ చేయాలి
- బ్యాంకర్లతో సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంట రుణాలను లక్ష్యానికి అనుగుణంగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ రుణాలను నిర్దేశించిన విధంగా మంజూరు చేయాలన్నారు. విద్య, గృహ, మౌలిక సదుపాయాలకు సంబంధించిన రుణాల మంజూరుకు సైతం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలని సూచించారు. బ్యాంకు లింకేజీకి సంబంధించిన మొండి బకాయిలను ప్రణాళికాబద్ధంగా రికవరీ చేయాలన్నారు. గతంలో సబ్సిడీ మంజూరైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. వివిధ కారణాలతో విలీనం కానున్న బ్రాంచ్‌లపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, ఎల్‌డీఎం రవికాంత్, డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రజిత, వివిధ శాఖల అధికారులు, 23 బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కార్యక్రమాలను ప్రారంభించాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన స్వయం సహాయక బృందం సభ్యురాలు జమున ఈవెంట్ మేనేజ్‌మెంట్ కోర్స్‌లో హైదరాబాద్‌లో పది రోజుల శిక్షణ పొందారు. ఆమెకు మంజూరైన సర్టిఫికెట్‌ను కలెక్టర్ సంగ్వాన్ బుధవారం తన చాంబర్‌లో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీఎం రమేష్ బాబు, ఏపీఎం మోయిస్, సీసీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కొనుగోళ్లలో అవకతవకలను అరికట్టాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు

- భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్

కామారెడ్డి క్రైం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 40 కిలోల 650 గ్రాములు మాత్రమే కాంటా చేయాలన్నారు. కాంటా పూర్తయిన తర్వాత 24 గంటల్లోగా రైతులకు డబ్బులు చెల్లించాలని, వడ్ల కుప్పలపై కప్పుకోవడానికి సరిపడా టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌రావు, కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, కార్యదర్శి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో బిక్కుబిక్కుమంటూ..

- పత్తాలేని హాస్టల్ సిబ్బంది
- భయాందోళనలో విద్యార్థులు
- ఇళ్లకు తీసుకెళ్లిన బంధువులు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ఎస్సీ బాలుర హాస్టల్‌లో బుధవారం రాత్రి సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో హాస్టల్‌లోని ఇద్దరు విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. దసరా సెలవులు ముగిసిన తర్వాత హరీశ్, కిషోర్ బుధవారం హాస్టల్‌కు చేరుకున్నారు. నైట్‌వాచ్‌మన్ అన్వర్ వారికి రాత్రి భోజనం పెట్టి బయటకు వెళ్లిపోయాడు. చీకటి కావడంతో విద్యార్థులు భయపడి హాస్టల్ బయటకు వచ్చి ఏడుస్తూ నిల్చున్నారు. స్థానికులు ఆరా తీసి, హాస్టల్‌లో సిబ్బందితోపాటు ఇతర విద్యార్థులెవరూ లేకపోవడంతో భయపడ్డారని తెలుసుకున్నారు. విద్యార్థులు స్థానికుల ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారి బంధువులు హాస్టల్‌కు వచ్చి ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కాగా విద్యార్థులను వారి బంధువులు ఇళ్లకు తీసుకెళ్లే సమయంలో వాచ్‌మన్ అన్వర్ తాగిన మైకంలో హాస్టల్‌కు చేరుకున్నాడు. వార్డెన్ స్థానికంగా ఉండకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై వార్డెన్ రాములును వివరణ కోరగా పొరపాటున తమ సిబ్బంది విద్యార్థులను హాస్టల్‌లో వదిలేసి వెళ్లారని, మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామన్నారు.



హాస్టల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులివ్వాలి

- సబ్‌కలెక్టర్‌కు ప్రైవేట్ కళాశాలల వినతి

బాన్సువాడ రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కోరాయి. బుధవారం బాన్సువాడ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతి పత్రం అందించాయి. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీంతో తాము భవనాల అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నామని, అధ్యాపకులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బాన్సువాడ డివిజన్‌లోని ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.



సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు

క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ క్యూర్ కోడ్, రెండు సంవత్సరాల వ్యవధి కలిగిన బీమా కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ తమ వివరాలు, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలన్నారు. అయా విషయాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు, తనిఖీలు చేపడతామన్నారు. రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి ఎస్సై రాజు, కామారెడ్డి రూరల్, రామారెడ్డి, మాచారెడ్డి మండలాలకు చెందిన దాదాపు 150 మంది ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం వడ్డించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కొప్పుశెట్టి కిరణ్మయి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్ కార్యాలయంతో పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు, అచ్చంపేట గ్రామాన్ని, ఆదర్శ మోడల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువులతో పాటు భోజనానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అచ్చంపేటలో దళిత బంధు పథకం కింద తీసుకున్న యూనిట్లు, వాటి ద్వారా వస్తున్న ఆదాయం వివరాలను ఆమె తెలుసుకున్నారు. తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో తిరుపతిరెడ్డి, గిర్దావర్ అంజయ్య, నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ కార్తీక, సంధ్య తదితరులున్నారు.

ఎంపీవోపై విచారణ

బిచ్కుంద(జుక్కల్): కార్యదర్శులు, మహిళా కార్యదర్శులను ఎంపీవో అబ్బాగౌడ్ వేధిస్తున్నాడని ఫిర్యాదు మేరకు బుధవారం డీపీవో శ్రీనివాస్‌రావు బిచ్కుందలో విచారణ చేపట్టారు. పది రోజుల క్రితం మండల కార్యదర్శులు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మండల పరిషత్ కార్యాలయంలో డీపీవో కార్యదర్శులతో సమావేశమై విచారణ చేపట్టారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి డబ్బులు ఇవ్వాలని ఎంపీవో డిమాండ్ చేశారని కార్యదర్శులు డీపీవో ఎదుట ఆరోపించారు. చిన్న జీపీ రూ.5 వేలు, పెద్ద జీపీ కార్యదర్శులు రూ.10 వేలు ఇవ్వాలని ఎంపీవో హుకుం జారీ చేశారని అన్నారు. వ్యక్తిగతంగా కక్షసాధింపులకు పాల్పడుతున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పని ఉన్నా మహిళా కార్యదర్శులను ఉదయం మండల పరిషత్ కార్యాలయానికి పిలిపించుకొని సాయంత్రం వరకు తన చాంబర్‌లో కూర్చోబెట్టుకొని అసభ్యకర పదజాలం వాడుతున్నారని మహిళా కార్యదర్శులు వాపోయారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. కార్యదర్శులు ఎవరికి లంచం రూపంలో డబ్బులు ఇవ్వవద్దు.. మహిళా కార్యదర్శుల అభిప్రాయాలు కూడా పరిగణలోకి తీసుకొని కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని తెలిపారు. బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ ఏడీఈగా బుధవారం మల్లేశం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేటలో పని చేసిన తిరుపతిరెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మల్లేశం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇరువురిని సన్మానించారు. ఏఈలు శ్రీనాథ్, హరీష్, ఎల్‌ఎం వహీద్, ఏఎల్‌ఎం యాదిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాల డబ్బులు స్వాహా

- సొంత అవసరాలకు వాడుకున్న వీఎల్‌ఈ నిర్వాహకురాలు
- రూ. 26 లక్షలు కాజేసిన వైనం
- గతంలో వీవోఏ రూ. 32 లక్షల వరకు టోకరా
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు
- పూర్తి స్థాయి ఏపీఎం లేక ఇబ్బందులు



మెండోరా ఐకేపీ కార్యాలయం

బాల్కొండ: మహిళా సంఘాల సభ్యుల పొదుపు డబ్బులతో పాటు రుణాల కిస్తులను సైతం స్వాహా చేసిన ఘటన మెండోరా మండల కేంద్రంలో కలకలం రేపింది. మండల కేంద్రంలో ఐకేపీ, ఎస్బీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న వీఎల్‌ఈ (విలేజ్ లెవల్ ఎంటర్ ప్రెన్యూర్) నిర్వాహకురాలు రూ. 26 లక్షలు కాజేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీఎల్‌ఈలో మహిళా సంఘ సభ్యులు ప్రతి నెలా తమ రుణాల డబ్బులను ఈ కేంద్రంలో చెల్లిస్తారు. కానీ సదరు కేంద్రం నిర్వాహకురాలు పూర్తిస్థాయిలో డబ్బులను బ్యాంకుకు జమచేయకుండా తన అవసరాలకు వాడుకునేది. దీంతో సదరు బ్యాంకు నుంచి రుణాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు మహిళా సంఘాల సభ్యులకు సమాచారం అందడంతో వారు అవాక్కయ్యారు.

ఆన్‌లైన్ రావడం లేదంటూ..

మహిళా సంఘాల సభ్యులకు చదువు రాకపోవడంతో సదరు వీఎల్‌ఈ వారిని మోసం చేసేది. కంప్యూటర్‌లో ఆన్‌లైన్ రావడం లేదని తర్వాత వాటి బిల్లులు ఇస్తానని చెప్పి వారిని నమ్మించేది. నామమాత్రంగా ఓ కాగితంపై డబ్బులు తీసుకున్నట్లు రాసి ఇచ్చేది. ఇలా ప్రతి నెలా సాగేది. తీరా అసలు విషయం బయటపడడంతో బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందిన సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే కేంద్రానికి చేరుకొని లెక్కలు చేస్తున్నారు. సుమారు రూ. 40 లక్షల వరకు టోకరా వేసినట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం రూ. 26 లక్షలు అని పేర్కొంటున్నారు.

గతంలో వీవోఏ..

మండలంలోని వెల్కటూర్ గ్రామానికి చెందిన వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) రెండేళ్ల క్రితం రూ. 32 లక్షలకు టోకారా వేసింది. మహిళా సంఘాల సభ్యులు మూడు నెలల పాటు బ్యాంకుకు రుణాలు చెల్లించకుంటే డ్యూ లిస్టు వచ్చేది. ఇది గమనించిన వీవోఏ మధ్యలో నెల చెల్లిస్తూ మరో రెండు నెలల డబ్బులను తన అవసరాలకు వినియోగించుకునేది. ఇలా ఆమె బండారం బయట పడటంతో ఉన్నతాధికారులు ఆమెను సస్పెన్షన్ చేశారు. ఇందులో ఏపీఎంపై పలు ఆరోపణలు రావడంతో అధికారులు ఏపీఎంను బదిలీ చేశారు. దీంతో ఇక్కడ రెండేళ్లుగా ఏపీఎం పోస్టు ఖాళీగా ఉంది. వీవోఏ నుంచి ఇంకా రూ. 12 లక్షలు రికవరీ కావాల్సి ఉంది.

నెల రోజుల నుంచి ఇన్‌చార్జి ఏపీఎం..

ఐకేపీలో గత రెండేళ్లుగా సీనియర్ సీసీ అక్కడ ఏపీఎం ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపడుతున్నారు. కానీ గత నెల రోజుల నుంచి బాల్కొండ ఏపీఎం గంగాధర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇందులో సీనియర్ సీసీని ఎందుకు బాధ్యతల నుంచి తప్పించారో, బాల్కొండ ఏపీఎంకు ఎందుకు బాధ్యతలు ఇచ్చారో తెలియదు. ఐకేపీలో అంతా గందరగోళ పరిస్థితి నెలకొంటోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి ఏపీఎంను నియమించాలని మహిళా సమాఖ్య సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

లెక్క కొనసాగుతోంది

వీఎల్‌ఈ బ్యాంకు రుణాలను చెల్లించకుండా వినియోగించుకున్న మొత్తంపై లెక్క కొనసాగుతోంది. పూర్తి స్థాయి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, ఇన్‌చార్జి ఏపీఎం

సమయానికి రాని టీచర్లు

ప్రార్థన చేయించిన అటెండర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పాఠశాలలో పని చేస్తున్న అటెండరే విద్యార్థులతో ప్రార్థన చేయించాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం 9.15 నిమిషాలకు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో అటెండరే ప్రార్థన చేయించారు. ప్రార్థన అనంతరం ఉపాధ్యాయులు రావడంతో గ్రామస్తులు ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న అటెండర్

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు.



గులాం దస్తగిరి(ఫైల్)

బాన్సువాడ: బాన్సువాడ అటవీ శాఖ రేంజ్ పరిధిలోని నిజాంసాగర్ సెక్షన్ అధికారి గులాం దస్తగిరి (58) బుధవారం ఉదయం బాన్సువాడ ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందాడు. సిద్దిపేట్ జిల్లా ములుగుకు చెందిన గులాం దస్తగిరి నిజాంసాగర్ సెక్షన్ అధికారిగా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లేందుకు దస్తగిరి సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దస్తగిరి మృతి చెందాడు.

చెరువులో పడి ఒకరు..

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్కాపూర్‌లో పెద్దోళ్ల లింగం(54) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ఊరచెరువులో పడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగం బుధవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకట్ట వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయమై రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ను వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు ..



రాజవ్వ(ఫైల్)

నిజామాబాద్ రూరల్: మండలంలోని గూపన్‌పల్లికి చెందిన పానుగంటి పెద్దరాజవ్వ(85) ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం పులాంగ్‌వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా మృతదేహం పెద్దరాజవ్వగా గుర్తించారు. ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లి శివారులోని రైల్వే గేటు వద్ద గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఆచూకీ తెలిసిన వారు 9440899341కు సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన కొంద్రు గణేశ్(25) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాల్కొండ ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్ బతుకుదెరువు నిమిత్తం ఈ నెల 15న సౌదీ అరేబియా వెళ్లేందుకు హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లాడు. ఆలస్యంగా వెళ్లడంతో విమానం వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన గణేశ్ ఇంటికి చేరుకొని పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశామని ఇందులో నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.6730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్పల్లి: మండలంలోని వాడి గ్రామ శివారులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై డీటీ రవి రాథోడ్ బుధవారం పట్టుకున్నారు. ఆటోలో 18 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఆటోను పీఎస్‌కు తరలించి ఇద్దరిపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

దత్తాపూర్ వాసి అదృశ్యం



డొంకేశ్వర్/నిజామాబాద్‌నాగారం: డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్ గ్రామానికి చెందిన సుంకరి భూమన్న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమన్న ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 14న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు బాత్‌రూంకి వెళ్తానని చెప్పి ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడు సుంకరి సంపత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

జీజీహెచ్‌లో భైంసావాసి ..



విజయ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆస్పత్రి నుంచి ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన ఊరెళ్ల విజయ అనే మహిళ సెప్టెంబర్ 29న చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. కానీ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

దుకాణం యాజమానిపై దాడి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంపై దాడి చేసిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. గాంధారి మండలం జువ్వాడి గ్రామానికి చెందిన బాలేందర్ పట్టణంలోని ప్రియ థియేటర్ కాంప్లెక్స్‌లో శివం ఎలక్ట్రికల్స్ దుకాణాన్ని నడుపుతున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో దుకాణం ఎదురుగా ఒక కారు వచ్చి ఆగింది. అందులో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. అప్పటికే వారి మధ్య ఏదో గొడవ జరుగుతోంది. వారు గొడవ పడుతుండగా దుకాణం యజమానులు బాలేందర్, శివరాజులు నవ్వారని కారులోని వ్యక్తులు భావించారు. సదరు వ్యక్తులు షాపులోకి వచ్చి వీరంగం సృష్టించారు. దుకాణం యజమానులతో పాటు దుకాణంపై దాడి చేసి సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాలేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

‘దాడి చేసి మాపైనే కేసు పెట్టారు’



కార్యాలయానికి వచ్చిన సాయిలు కుటుంబం

కామారెడ్డి టౌన్: కిరాయి గుండాలతో కలిసి తమపై దాడి చేయడమే కాకుండా తమపైనే కేసు పెట్టించారని గాంధారికి చెందిన ఓ కుటుంబం వాపోయింది. తెలంగాణ ఎరుకల హక్కుల ఐక్య పోరాట సాధన సమితి ఆధ్వర్యంలో బాధిత కుటుంబీకులు బుధవారం ఎస్పీ కార్యాలయానికి తరలివచ్చారు. సమితి జిల్లా అధ్యక్షుడు కుర్ర రాములు, బాధిత కుటుంబానికి చెందిన ఎరుకల పెద్ద సాయిలు మాట్లాడుతూ.. దాదాపు పాతికేళ్ల క్రితం తమ కుటుంబం బతుకుదెరువు కోసం గాంధారికి వచ్చామన్నారు. దుర్గానగర్ కాలనీలో హనుమంత రావు అనే వ్యక్తి వద్ద పాతికేళ్ల క్రితం స్థలాన్ని కొనుగోలు చేసి మూడు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నట్లు తెలిపారు. గత నెల 26న తాను ఇంట్లో లేని సమయంలో గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మరో 50 మంది కిరాయి గూండాలను వెంటబెట్టుకుని వచ్చి గుడిసెలను ఖాళీ చేయాలంటూ తన కుటుంబంపై దాడికి పాల్పడ్డారని వెల్లడించారు. గుడిసెలు ఉన్న స్థలం తమదంటూ గొడవపడ్డారని అన్నారు. గుడిసెలు, రేకులను ధ్వంసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషిస్తూ తన కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆరోపించారు. ఆ తర్వాత తామే దాడి చేసినట్లు గాంధారి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టించారని వాపోయారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు



బాన్సువాడ ఎంఈవోకు జాయినింగ్ రిపోర్టు అందిస్తున్న కొత్త ఉపాధ్యాయులు



లింగంపేట ఎంఈవో షౌకత్ అలీకి..

డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో బుధవారం విధుల్లో చేరారు. వారికి ఆయా మండల కేంద్రాల్లో ఎంఈవోలకు కొత్త ఉపాధ్యాయులు జాయినింగ్ రిపోర్టులను అందజేశారు. వారికి స్థానిక ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నేతలు, విద్యార్థులు స్వాగతం పలికారు. నాగిరెడ్డిపేటకు 30 మంది , గాంధారి మండలానికి 9 మంది, లింగంపేటకు 26 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. – సాక్షి నెట్‌వర్క్



పెద్దకొడప్‌గల్ ఎంఈవో ప్రవీణ్ కుమార్‌కు..



నూతన ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న నాగిరెడ్డిపేట ఎంఈవో భాస్కర్‌రెడ్డి

కల్తీ కల్లు తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ

లింగంపేట: కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం .. సురాయిపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ నిషేధిత ఆల్ప్రాజోలంతో పాటు పలు రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దుకాణంపై దాడి నిర్వహించినట్లు పేర్కొన్నారు. సోదాల్లో కల్లు దుకాణం నుంచి రెండు కల్లు సీసాలు, 30 గ్రాముల ఆల్ప్రాజోలం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రమేశ్‌గౌడ్‌ను విచారించగా నాగిరెడ్డిపేట మండలం రామక్కపల్లికి చెందిన కలాలి సత్యనారాయణగౌడ్ వద్ద ఆల్ప్రాజోలం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడిలో లింగంపేట ఎస్సై అరుణ్‌కుమార్, కానిస్టేబుల్ రాజేందర్, భైరవప్రసాద్, రమేష్, రామస్వామి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం వీరిని డీఎస్పీ అభినందించారు.

అదుపు తప్పి కల్వర్టులో కారు బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



కల్వర్టులో బోల్తాపడిన కారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలోని బీబీపూర్ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టులో బోల్తా పడింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం యాచారం తండాకు చెందిన బి బాల్‌సింగ్ ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఇందల్వాయి మండలం పాటితండాలోని చెల్లెలు వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి నిజామాబాద్‌కు కారులో బయలుదేరాడు. బీబీపూర్ వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డులను ఢీకొని పక్కనే ఉన్న కల్వర్టులో బోల్తాపడింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కారులో నుంచి బాల్‌సింగ్‌ను బయటకు తీశారు. ప్రమాదంలో బాల్‌సింగ్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. గాయపడ్డ బాల్‌సింగ్‌ను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భిక్కనూర్‌లో ఆటో ..



ధ్వంసమైన ఆటో


ఎల్లారెడ్డిరూరల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న ఆటో బోల్తా పడిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలంలోని ఎక్కపల్లి నుంచి ఎల్లారెడ్డి వైపునకు వెళ్తున్న ఆటో గ్రామ శివారులో నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తి ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న చాకలి కిష్టయ్య, సుధాకర్, సంతోష్, మోతి, ప్రకాశ్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చాకలి కిష్టయ్య, ఆటో డ్రైవర్ ప్రకాశ్‌ను కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. క్షతగాత్రులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా పరామర్శించారు.

చందూర్‌లో వడ్ల లారీ ..



వర్ని: చందూర్ శివారులో బుధవారం వడ్ల లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. వర్ని మండలంలోని రాజేపేట గ్రామంలో రైతుల వద్ద ధాన్యం సేకరించి లారీలో తీసుకెళ్తుండగా చందూర్ శివారులో బోల్తా పడింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వడ్లు నీటిలో పడి తడిసిపోయాయి. స్థానికులు, రైతులు బోల్తా పడిన లారీని యంత్రాలసాయం పైకి తీయించారు.


మానేరులో దూకి ఆత్మహత్య



ప్రకాశ్(ఫైల్)

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన గుడ్లపల్లి ప్రకాశ్(55) రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రకాశ్ కుమార్తె పెళ్లికి చేసిన అప్పుతో పాటు భార్య నాగలక్ష్మి అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రి ఖర్చుల కోసం మరింత అప్పు చేశాడు. ప్రకాశ్ మంగళవారం కూలి పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం మానేరులో మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబీకులు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో మరొకరు..



స్వామి(ఫైల్)

భిక్కనూరు: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాతినిపల్లి స్వామి(36) హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. దసరా పండుగకు స్వగ్రామమైన తిప్పాపూర్‌కు వచ్చాడు. కొంత కాలంగా వంశపార పర్యంగా వస్తున్న వ్యవసాయభూమి తన పేరిట మార్పిడికి యత్నిస్తున్నా జరగలేదు. దీనికి తోడు చేసిన అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. స్వామిది పేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన వారికి ట్రాఫిక్ సీఐ వీరయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపర్చగా జిల్లా సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ అహ్మద్ మొహియుద్దీన్ ముగ్గురికి రూ.7 వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

డీజే నిర్వాహకుడికి ఒక రోజు..

ఖలీల్‌వాడి: లైసెన్స్ లేకుండా డీజే నిర్వహిస్తున్న వ్యక్తికి మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం కులాస్‌పూర్‌కు చెందిన నిమ్మల వంశీ లైసెన్స్ లేకుండా డీజే సౌండ్ సిస్టం నిర్వహిస్తున్నాడు. తన డీజే సౌండ్ సిస్టంను కిరాయికి ఇవ్వడంతో ఫిర్యాదు నమోదైంది. దీంతో నిర్వాహకుడు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



భిక్కనూరు: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో పాడి గేదె బుధవారం మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఖాదీర్‌కు చెందిన గేదె గడ్డి మేస్తుండగా అకస్మత్తుగా విద్యుత్ తీగ తెగిపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై సమాచారం అందుకున్న పశువైద్యాధికారి దేవేందర్ ఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు.